క్లుప్తంగా

గణతంత్ర వేడుకల్లో ఉపాధ్యాయినుల ప్రతిభ



పెదకాకాని: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించారు. మండలంలోని అనుమర్లపూడి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు ఆర్.నిర్మల కుమారి, విద్యార్థి మిత్ర యూనిఫాంను చిన్న చిన్న బొమ్మలకు స్వయంగా తయారు చేసుకొని ప్రదర్శించారు. అలానే గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం జిల్లాపరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఆర్.విజయకుమారి(యస్ ఏ తెలుగు) విద్యార్థులకు సులభంగా అర్థం చేసుకునేందుకు ఆసక్తిని పెంపొందించేందుకు వర్ణమాల బావి ప్రదర్శించారు.

సీఐకి ఉత్తమ సేవ అవార్డు



పెదకాకాని: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీటీ నారాయణస్వామి ఉత్తమ సేవ అవార్డు అందుకున్నారు. ఆదివారం గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ పలు కేసులను ఛేదించడంలో చాకచక్యం వ్యవహరిస్తున్న సీఐ. జిల్లా ఎస్పీ ప్రశంసాలు పొందారు. అవార్డు అందుకున్న సీఐ నారాయణస్వామిని పలువురు అభినందించారు.

గ్రామీణ రైతులకు సాగులో శిక్షణ

గుంటూరు రూరల్: వ్యవసాయ దిగుబడులకు విలువల జోడింపు అనేది స్వయం ఉపాధికి సరైన మార్గమని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్‌లో ఎన్‌టీఆర్ పశువైద్య కళాశాలకు చెందిన పశువైద్య విస్తరణ విభాగంలో శిక్షణ తీసుకుంటున్న గ్రామీణ మహిళా రైతులకు సేంద్రియ వ్యవసాయం, విలువల జోడింపుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి.సుబ్రమణ్యేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శిరీష, వెటర్నరీ అసిస్టెంట్ ఇన్‌చార్జి డాక్టర్ ఐ.గాంగ భవాని మాట్లాడుతూ పాడి పశువుల యాజమాన్య పద్ధతులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ట్రాలీ ఆటో ఢీ కొట్టడంతో కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. చేబ్రోలు పాతరెడ్డిపాలెం ప్రాంతానికి చెందిన ఆదాం రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. చేబ్రోలు చైతన్య గ్రామీణ బ్యాంక్ రోడ్డు నుంచి జీబీసీ రహదారి దాటుతున్న ఆదాంను గుంటూరు వైపు వెళ్తున్న టాటా ఏసు ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. బాధితుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. సోమవారం తెల్లవారుజామున చౌడవరం ఎన్‌హెచ్ 16లో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాలు కలిగిన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. వ్యక్తి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని ఆచూకీ తెలిసినవారు నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు. మృతదేహాన్ని పోలీసులు జీజీహెచ్ మార్చురికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యులుగా చేరాలి

పొన్నూరు: నిరంతరం సేవా కార్యక్రమాలతో ముందుకు సాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలని సొసైటీ అధ్యక్షులు, తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెడ్ క్రాస్ పొన్నూరు బ్రాంచి కమిటీ సమావేశం నిర్వహించారు. సొసైటీ సభ్యులు రెడ్‌క్రాస్ చేసిన సేవలను వివరించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలు, జీవిత కాలం సభ్యుల గుర్తింపు కార్డులు జారీ, సంస్థ నిర్వహణ కొరకు భవనం పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో రెడ్ క్రాస్ చైర్మన్ వి.వి.గుప్తా, ట్రెజరర్ కె.ఆంజనేయులు, వైస్ చైర్మన్ ఆర్.కిరణ్, సభ్యులు పి.రవీంద్రనాథ్, కె.వెంకటేశ్వర్లు, పి.గణేష్ పాల్గొన్నారు.

దా.. రుణ మోసాలు

- నమ్మించి... ఆర్థికంగా దోపిడీ
- ప్రైవేటు చీటీలు, అధిక వడ్డీ పేరుతో బురిడీ
- డబ్బులు ఇచ్చే సమయానికి ఐపీ నోటీసులు, బెదిరింపులు
- ఇటీవల పొన్నూరులో 41 మందికి ఐపీ నోటీసులు
- డబ్బులడిగితే దుర్భాషలాడటంతో మనస్తాపంతో చేబ్రోలులో వ్యక్తి ఆత్మహత్య



పొన్నూరు ఐలాండ్ సెంటర్

పొన్నూరు: పట్టణంలో ఇటీవల ఒక వ్యక్తి సుమారు రూ. కోటి 8 లక్షలకు ఐపీ పెట్టాడు. ప్రైవేటు చిట్స్ పేరుతో ఎంతోమందిని నమ్మకంతో మోసం చేశాడు. ప్రజల సొమ్ముతో విలాస జీవితం గడుపుతూ ఐపీ పెట్టి వారిని నట్టేట ముంచాడు. నమ్మి చిట్టీలు వేసిన 41 మందికి నోటీసులు అందడంతో గగ్గోలు పెడుతున్నారు. వారితో పాటు అనేక ప్రాంతాలకు చెందిన వారు అతడి వద్ద చీటీ కట్టి నోటీసులు అందడంతో లబోదిబోమంటున్నారు.

– చేబ్రోలుకు చెందిన మరో వ్యక్తి చీటీ డబ్బులు కట్టించుకొని చెల్లించే సమయానికి డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా, అడిగినందుకు దుర్భాషలాడటంతో మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఈ రెండు చోట్లే కాదు. ఇలా ప్రతి చోటా ప్రైవేటు చిట్స్ వ్యాపారులు, అధిక వడ్డీలకు తీసుకునే వ్యక్తులు ప్రజలను ఆశల వలలో ఉంచి దారుణ మోసాలకు పాల్పడుతున్నారు.

పొన్నూరులో కోట్లలోనే..

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేటు చీటీ పాటల వ్యాపారం రూ.కోట్లలో నడుస్తోంది. పల్లె నుంచి పట్టణం దాకా ఇది విస్తరించింది. స్నేహితులు, ఇంటి పక్కనవారు, తెలిసినవారు, బంధువులు ఇలా ఎవరో ఒకరు 10 నుంచి 20 మంది సభ్యులుగా ఏర్పాటు చేసి చీటీ పాటలు పెడుతున్నారు. కొందరు రూ.కోట్ల వరకు చీటీ పాటలు ప్రైవేటుగా నిర్వహిస్తున్నారు. వారు చీటీ పెట్టిన ప్రతిసారి సభ్యులను దుబాయ్, సింగపూర్ తదితర దేశాలకు తీసుకెళ్లి ఆకర్షిస్తున్నారు. పొన్నూరులో కూడా ఇలాంటి వ్యక్తులు పదుల సంఖ్యలోనే ఉన్నారు. చాలా మంది సామాన్యులతో పాటు, ప్రముఖులు ప్రైవేటు చీటీ పాటల్లో సభ్యులుగా ఉన్నారు. చీటీ వేసిన వారిని మోసగించే ఐపీ సంస్కృతి రోజు రోజుకూ పెరుగుతుంది. ఎక్కడ చూసినా ప్రతి నెలలో ఎక్కడోచోట ప్రజల సొమ్ము దోచుకుని ఐపీ పెడుతున్నవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. నమ్మకంతో వివిధ రకాలుగా నగదు వసూలు చేసి ప్రజలను నట్టేట ముంచుతున్నారు. నెలల తరబడి సక్రమంగా చెల్లించిన సొమ్ము చివరి నెలలో తిరిగి వచ్చే సమయానికి ఐపీ నోటీసులు అందడంతో ప్రైవేటు ఉద్యోగులు, చిరు వ్యాపారులు, సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

అందరికీ విద్య 'స్ఫూర్తి' లక్ష్యం

ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా



విద్యార్థులతో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ తదితరులు

గుంటూరు రూరల్: అందరికీ విద్యనందించడమే స్ఫూర్తి ఫౌండేషన్ లక్ష్యమని ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూరల్ మండలంలోని పెదపలకలూరు, అంకిరెడ్డిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎస్‌సీ న్యూ మోడల్ టెస్ట్ పేపర్ 2025 పుస్తకాల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలన్న సమోన్నత సంకల్పంతో శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి స్ఫూర్తి ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టెస్ట్ పేపర్లను ఇప్పటి వరకు రూరల్ మండలంలోని అంకిరెడ్డిపాలెం, పెదపలకలూరుతోపాటు నల్లపాడు, పొత్తూరు, యనమదల, వెంగళాయపాలెం, జొన్నలగడ్డ, అడవితక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలలు, గుంటూరు నగరంలోని వేణుగోపాల్ నగర్, గుజ్జనగుళ్ల, రవీంద్రనగర్, స్తంభాలగరువు, రైలుపేట, కొత్తపేట, నవభారత్‌కాలనీ, స్వర్ణాంధ్రనగర్ మున్సిపల్ పాఠశాలలు, పులిపాక ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో మిగిలిన పాఠశాలల్లో కూడా పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అంకిరెడ్డిపాలెం ప్రధాన ఉపాధ్యాయురాలు సరోజిని, పలకలూరు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఫౌండేషన్ ప్రతినిధులు నూనె ఉమామహేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, గంగాధరరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

–తెనాలి డెప్యూటీ డీఈఓ శాంతకుమారి



నారాకోడూరులో మాట్లాడుతున్న డెప్యూటీ డీఈఓ శాంతకుమారి

చేబ్రోలు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెనాలి ఉప విద్యాశాఖ అధికారి జి.శాంత కుమారి అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ అమలు తీరు గురించి విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం రోజువారి అంశాలు చదువుకోవాలని సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, పరీక్షా సమయంలో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత కావటానికి యాక్షన్ ప్లాన్ ప్రకారం చదివించాలని, దత్తత తీసుకున్న విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని, సులువైన బోధనా పద్ధతుల్లో విద్యార్థులకు కనీసం పాస్ మార్కులు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. పాండిచ్చేరిలో జరిగిన నేషనల్ సైన్స్ ఫేర్‌లో ప్రతిభ కనబరిచినందుకు ఎస్కే నజ్మాను అభినందించారు. హెచ్ఎం ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

దత్తనాథక్షేత్రాల ద్వారా ఆధ్యాత్మిక సేవలు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



అనుగ్రహ భాషణ చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

గణపతి సచ్చిదానంద స్వామీజీ

గుంటూరు రూరల్: ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా క్షేత్రం ఆశ్రమాల ద్వారా ఆధ్యాత్మిక సామాజిక సేవలు తమ భక్తులు స్వచ్ఛందంగా చేస్తూ సమాజాభివృద్ధికి దోహదం చేస్తున్నారని దత్త పీఠాధిపతి పరమ గణపతి సచ్చిదానంద స్వామీజీ పేర్కొన్నారు. దత్తాశ్రమాల రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీతో కలసి చౌడవరం శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమం దత్తనాథ క్షేత్రం విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50కు పైగా ఉన్న దత్త క్షేత్రాలను సందర్శిస్తున్నట్లు చెప్పారు. తమ భక్తులు కరోనా సమయంలో కూడా లక్షలాది మందికి ఆకలి దప్పులు తీర్చారని తెలిపారు. చౌడవరంలోని దత్తనాథ క్షేత్రం ఆధ్యాత్మిక చింతన ఉట్టిపడేలా అన్ని వసతులతో తీర్చిదిద్దారని ట్రస్టీలను అభినందించారు. మంగళవారం ఉదయం గోపూజ శ్రీ చక్రవర్తిన హోమం అనంతరం ఆంజనేయ రాగసాగర నాద ధ్యాన చికిత్స కచేరి జరుగుతుందని వివరించారు. శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గోపీచంద్, ట్రస్టీలు బి.సీతా రామిరెడ్డి, డాక్టర్ వెంకటరత్నం, మిట్టపల్లి రాజేంద్రబాబు, వీడీ గాంధీ స్వామీజీ ఆశీస్సులు పొందారు.

పైసలు పడనిదే కదలని ఫైల్స్

తహసీల్దార్ కార్యాలయం అడ్డగా...

గుంటూరు రూరల్: గుంటూరు వెస్ట్ తహసీల్దారు కార్యాలయంలో ద్వితీయ శ్రేణి అధికారిణి, ఇతర అధికారులతో కలసి ప్రతి పనికి ఒక రేటు ఫిక్స్‌చేసి ప్రజల సమస్యలను సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేరుగా సమస్యల పరిష్కారం కోసం అర్జీలు తీసుకెళితే ప్రజలు వారి చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వారు ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న వ్యక్తుల ద్వారా వెళితే సమస్య పరిష్కారం జరుగుతుందని చెబుతున్నారు. ఇటీవల పెదపలకలూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన పొలం పాస్‌బుక్‌లో కొన్ని సెంట్లు తగ్గిందని దానిని సర్వే చేయించుకుని సర్వే సర్టిఫికెట్‌తో సహా పాస్‌బుక్‌లో తమ మిగిలిన భూమిని ఎక్కించాలని కోరాడు. నెలలు గడుస్తున్నా ఫైల్ మాత్రం ముందుకు కదలలేదని అదేమంటే మరలా సర్వే చేయించుకోండి. స్థానిక వీఆర్‌ఓను కలవండి, ఇతరులను కలవండి అంటూ ప్రతి రోజు ఏదోక సాకుతో తిప్పించుకుంటున్నారని బాధితుడు వాపోయాడు. అదేవిధంగా ఎవరైన పాస్‌బుక్, అడంగల్, 1బీ ఇతర సమస్యలతో కార్యాలయానికి వెళితే ఇక అంతే సంగతులు ప్రతి పనికి ఒక రేట్ ఫిక్స్ చేసినట్లు పాస్‌బుక్‌కు ఏకంగా రూ.50 వేల నుంచి వసూలు చేస్తున్నట్లు సమాచారం.

సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపండి



పొన్నూరు: ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సర్వే కోసం 5, మున్సిపల్ సర్వే కోసం 1, పంచాయతీరాజ్ 1, అడంగల్ సవరణ 1, ఆర్‌అండ్‌బీ 1 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు చొరవ చూపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ జి.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి రోజు ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నట్లు ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ఎంఈఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు ప్రతి విద్యార్థి భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. భోజనాన్ని రుచి చూశారు. ఆయన వెంట హెచ్ఎం శీలం అంకారావు ఉన్నారు.

ఫిబ్రవరి 9న మహా నిరసన ర్యాలీ

నెహ్రూనగర్: త్వరలో చేపట్టబోయే జనగణనతో పాటే ఓబీసీ కులగణన కూడా చేపట్టాలని డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న గుంటూరు నగరంలో మహా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓబీసీ అని చెప్పుకునే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీలకు చేసిందేమి లేదన్నారు. బీపీ మండల్ చేసిన సిఫార్సులు అమలు చేయాలని ప్రధానిని కలిసినప్పటికి ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

చినలింగాయపాలెంలో రెండు పూరిళ్లు దగ్ధం



కాకుమాను: మండలంలోని చినలింగాయపాలెంలో సోమవారం వేకువజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు పూర్తిగా అగ్నికి కాలిపోయాయి. గ్రామ వీఆర్వో తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ముద్రబోయిన సాంబయ్య, ముద్రబోయిన తిరుపతయ్య కుటుంబాలకు చెందిన రెండు పూరిళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతైపోయాయి. సుమారు నాలుగు గంటల సమయంలో ప్రమాదం జరగడంతో రెండు కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. సుమారు రూ.50 వేలకు పైగా ఆస్తి నష్టం జరిగిఉండవచ్చునని వీఆర్వో తెలిపారు. సోమవారం బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను తహసీల్దార్ బి.వెంకటస్వామి అందజేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



డ్రెయిన్ పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్

గుంటూరు రూరల్: నగరంలో నగరపాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేయాలని, పనులను ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టితో పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ రెడ్డిపాలెం, నగరాలు, గోరంట్ల, ముత్యాలరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు జీఎంసీ అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బిల్లుల చెల్లింపునకు ముందే చేపట్టిన అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు. పనుల్లో నాణ్యత లోపాలు గమనిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌ని బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు, పర్యవేక్షణ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆర్టీఓ ఆఫీస్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, క్యాంటీన్లలో తాగునీరు, మౌలిక వసతులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యత, మౌలిక వసతులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల రద్దీకి తగిన విధంగా ప్రతిరోజు ఆహార ఇండెంట్ పెంచుకోవడం చేయాలని సిబ్బందికి సూచించారు. అన్న క్యాంటీన్ నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత ఇతర అంశాలపై ప్రజలు క్యాంటీన్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను, సూచనలను తెలుపవచ్చాన్నారు. పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాసరావు, ఆర్ఓ రవి కిరణ్ రెడ్డి, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక బోధనా విధానాన్ని అనుసరించేందుకు ఎఫ్‌డీపీ(ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం) శిక్షణ తరగతులు అధ్యాపక బృందానికి సహాయపడతాయని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సహకారంతో చౌడవరంలోని కళాశాలలో 'ఇంట్రడక్షన్ టూ జెనెరేటివ్ ఏఐ మోడల్స్ అండ్ అప్లికేషన్స్' అనే అంశంపై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి అధ్యాపక శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. జాతీయ స్థాయిలో జరుగుతున్న అధ్యాపక శిక్షణ తరగతులకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అటల్, తమ కళాశాల ద్వారా నిర్వహణకు అనుమతులతో పాటు నిధులు మంజూరు చేయడం గర్వకారణమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ నగేష్, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎ.శ్రీకృష్ణ, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

టిప్పర్లతో తిప్పలు



ఇసుకపై పట్టా కప్పకుండానే వెళుతున్న టిప్పర్



పట్టా లేకుండా టిప్పర్‌పై తరలిస్తున్న బండ రాళ్లు

ప్రత్తిపాడు: టిప్పర్ డ్రైవర్లు వాహనాలను ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు, రవాణాశాఖ అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. ఇసుక, భారీ కొండరాళ్లు, బండలను తరలించే సమయంలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలను కూడా తీసుకోకుండా ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారు. అందుకు నిదర్శనమే గుంటూరు– పర్చూరు రోడ్డులో కనిపించిన ఈ చిత్రాలు. ఇసుకు లోడుతో వెళుతున్న టిప్పర్‌పై ఎలాంటి పట్టాలు కప్పకుండా వాహనాలను నడుపుతుండటంతో, దారిపొడవునా వెళ్లే ప్రయాణికుల కళ్లలో ఇసుకపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా భారీ కొండ రాళ్ల బండలను ఎలాంటి పట్టాలు కప్పకుండానే తరలిస్తున్నారు. ఆ లారీల నుంచి కూడా డస్ట్ ఎగిసి పడుతుండటంతో ప్రయాణం నరకమవుతోంది.

బెల్టు షాపులదే హవా..



ఉప్పరపాలెంలో దుకాణం ఆవరణలో పారేసిన మద్యం ఖాళీ సీసాలు, గ్లాసులు



దుకాణంలో అమ్మకానికి ఉంచిన మద్యం సీసాలు

- ఇళ్ల మధ్య, రోడ్ల పక్కన జోరుగా మద్యం విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

పొన్నూరు: పొన్నూరులో మద్యం ఏరులై పారుతోంది. పట్టణాలు, పల్లెలు తేడాలేకుండా గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నారు. అధికారుల అలసత్వంతో మద్యం మాఫియా వీధికో గొలుసు దుకాణం ఏర్పాటు చేస్తోంది. కిళ్లీ, కిరాణా, చిరుతిండ్ల దుకాణాలు కూడా మద్యం విక్రయాలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని ఉప్పరపాలెం గ్రామం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన గొలుసు దుకాణంలో విచ్చల విడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించిన వైన్ షాపునకు ధీటుగా మూడు ఫ్రిజ్‌లు ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మండలంలో బెల్టు షాపులేని గ్రామం ఉందంటే అతి శయోక్తి లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు దుకాణాలకు అనుమతులు ఉంటే బెల్టు షాపులకు మాత్రం రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటల పాటు అమ్మకాలు కొనసాగుతున్నాయి.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

మండలంలో బెల్టు షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఉప్పరపాలెంలో గొలుసు దుకాణం ఏర్పాటైన విషయం తమ దృష్టికి వచ్చిందని నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటాం. మండలంలో ఎక్కడైనా గొలుసు దుకాణ ఏర్పాటు చేస్తే ప్రజలు తెలియ జేయాలి.

రమేష్, సీఐ. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

లక్ష్మీపురం: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి డి.దీప్తి మనోజ కోరారు. అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఫిబ్రవరి 13న సామూహిక రాయబార కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.